
# పాళీ విరిగిపోయింది



"సప్!"

తల వంచుకొని ఏకదీక్షగా వ్రాస్తూన్న సుశీల తుళ్ళిపడి, తల ఎత్తి చూసింది. కోటు విప్పి అప్పుడే హేంగర్‌కి తగిలిస్తున్నాడు శంకర్.

సుశీల నిట్టూర్చి, "ఓహ్! మీరా! హఠాత్తుగా పిలిచేసరికి హడిలిపోయేను. ఉండండి, ఒక్క నిమిషం, కాఫీ ఇస్తాను." అంటూ మళ్ళీ తన రచనలో మునిగిపోయింది.

శంకరం కుర్చీలో కూలబడ్డాడు. అతనొక ప్రయివేటుకంపెనీ మేనేజరు. చిన్నప్పుడు శంకరానికి కూడా కథలు రచించాలని, అవి పత్రికలలో పడితే తన పేరు గర్వంగా చూసుకోవాలనీ చాలా ఉబలాటంగా ఉండేది. తనూ ఒక పెద్ద రచయిత కావాలని కలలు కనేవాడు. కాని, అతనెంత ప్రయత్నించినా అతనికి చేతకాలేదు. ఒకవేళ కష్టపడి ఒకటి, రెండు కథలు వ్రాసినా, అవి ఏ పత్రికలోనూ అచ్చయేవి కావు. దాంతో అతనికి రచయిత్రులంటే ఒక విధమయిన అసూయ, ఈర్ష్య ఏర్పడ్డాయి.

"ఏమండోయ్! మిమ్మల్నేనండీ! ఏమిటంత దీక్షగా



**మనసు విరిగితే అతకటం కష్టం. అసూయ ఉప్పుగల్లులాగా మనసును విరిచేస్తుంది. దానికి తనవారు, పెర వారు అనే భేదంలేదు. భార్య భర్త సుఖాన్ని, సంసార సుఖాన్నీ కాంక్షిస్తే ఆ ఉప్పును చక్కెరగా మార్చగలదు.**

ఆలోచిస్తున్నారు?" అంటూ సుశీల భుజం పట్టుకు కుదిపేస్తూంటే, ఆలోచనలనుండి తేరుకున్నాడు. మౌనంగా కాఫీ తాగేసి, హాషరు తెచ్చుకుని, "సుశీ! వేగంగా రెడీ అవ్వు, అలా షికారుకి వెళదాం. ఊఁ క్విక్!" అన్నాడు.

"అబ్బ! ఇవ్వాల్టికి వద్దండీ! కథ పూర్తిచెయ్యాలి. తరవాతయితే మళ్ళీ మరిచిపోతాను" అనేసి మళ్ళీ తన ప్రపంచంలో మునిగిపోయింది.

శంకరంమనస్సు అదోలా అయిపోయింది. 'ఛ! ఈ రచయిత్రులంతా ఇంతే. పెద్ద ఏదో కొంప మునిగిపోయినట్టు, మిగతా పనులన్నీ వదిలేసి కూర్చుంటారు. రెండు మూడు రోజులబట్టీ సుశీల ఇలాగే ఎగవేస్తూంది. అంతకు ముందు ప్రతీ సాయంత్రం తనూ, సుశీల ఎంత హాయిగా షికారుకి వెళ్ళేవారో! ప్ఛ్, ఏమిటో!' అనుకున్నాడు.

సుశీలవేపు చూసేడు. అదేం పట్టనట్టు సుశీల వ్రాసుకుపోతూంది. అతనికి చెడ్డచిరాకు వేసింది.

ఎంత మరిచిపోదామన్నా అతను ఒకనాడు జరిగిన సంఘటన మరిచిపోలేకపోతున్నాడు. ఔను! అది తన జీవితంలో మరిచిపోలేడు!

అప్పటి కింకా అతను మేనేజరు కాలేదు. ఆ కంపెనీలోనే పనిచేస్తూండేవాడు. ఆ కంపెనీలోనే సుజాత అనే ఆమె టైపిస్టుగా పని చేస్తూండేది. ఆమె రచయిత్రి. తరుచు ఆమె రచనలు పత్రికలలో పడేవి. తనూ రాయాలని ఉబలాటపడ్డాడు. ఆ మాటే ఆమెతోఅన్నాడు. ఆమె నవ్వి, "విష్ యూ బెస్ట్ సక్సెస్" అన్నాది.

అతనెంతో ప్రయత్నించి, ఒక కథ వ్రాసి, ప్రభకి పంపి, అది చూపెట్టేడు. ఆమె చదివి, నవ్వుతూ, "సారీ! అట్టే బాగులేదండీ! నా అభిప్రాయం చెప్పేనంతే" అన్నాది. ఆమె అన్నట్టే అది పడలేదు. అప్పటినుండి 'రచయిత్రులకి చాలా గర్వం' అని విశ్వసించుకున్నాడు. అప్పటినుండే అతనికి రచయిత్రులంటే ఈర్ష్యాసూయలు ఏర్పడ్డాయి. మరునాడు ఆమె అతని పరిస్థితి చూసి అదోలా నవ్వుతూ, "శంకరంగారూ! మీరిలా బాధపడడం బాగులేదండీ! అందరూ రచించలేరు మరి!" అన్నాది. అగ్నిలో ఆజ్యం పోసినట్టయింది!

శంకరం భారంగా నిట్టూర్చి, సుశీలవేపు చూసేడు. సుశీల ఇంకా అలాగే వంచినతల ఎత్తకుండా రాసుకు పోతూంది. శంకరం బయటికి వెళదామని లేవబోయేడు. అప్పుడే అయిపోయింది కాబోలు, సుశీల అవి కట్టేసి,

## అక్కినపల్లి కృష్ణారావు

అప్పుడే బయలుదేరుతున్న శంకరాన్ని చూసి, "ఇంత చీకటి ...వ్వాక వెళ్ళాలా?" అన్నాది. శంకరం సుశీల దగ్గిరికి వెళ్ళి, ప్రేమగా చూస్తూ, "సుశీ! నువ్వు కథలు రాయటం మానెయ్యకూడదా!" అన్నాడు.

సుశీల ఆశ్చర్యపోయింది. రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేకపోయింది. తరవాత అనుమానంగా చూస్తూ, "ఏమిటి, ఎప్పుడూ లేనిది, ఇవ్వాళ ఇలా మాట్లాడుతున్నారు?" అన్నాది.

శంకరం ఏమీ అనలేకపోయాడు. అతను సుశీలని ఏరి కోరి పెళ్లి చేసుకున్నాడు. ఆనాడే అనుకున్నాడు 'సుశీల నే పరిస్థితుల్లోనూ కష్టబెట్టకూడ,దని' అసలయినా తన స్వార్థం కోసం ఇలా ప్రవర్తిస్తున్నట్టు తనకే తెలుసు. అయినా తనలా ఊరుకోలేడు. ఒక వారం క్రిందటే, ఒకనాడు ఎలా బుద్ధి పుట్టిందో కాని, ఒక కథ రాసి ప్రభకి పంపింది. 'పడకుండాఉంటే బాగుండును. ఇంకెప్పుడూ రాయదు' అనుకున్నాడు. కాని, అది ప్రభలో ప్రచురించబడింది. అప్పటినించే ఆమె రచయిత్రి అయిపోయింది.

"మాట్లాడరేమండీ! అసలేమయిందండీ, ఇవ్వాళ ఇంత పరధ్యానంగా ఉన్నారు?" అంటూన్న సుశీల మాటలలో ఈ లోకంలో పడ్డాడు. సుశీలవేపు చూడకుండానే, "ఏం లేదు!" అంటూ వీధిలోకి వెళ్ళిపోయేడు.

సుశీల ఇందాకా వ్రాసిన కథని ఫెయిర్‌కాపీ రాయటానికి కూర్చున్నాదే కాని, కలం ముందుకి సాగలేదు.

'అసలెందుకివాళ ఇలా ఉన్నారో! కథలు రాయటం మానెయ్యమంటారేం? కథలంటే ఇష్టం లేదా. . ఛ. ఛ కథలంటే ఇష్టంలేనివాళ్ళు ఉండరు. ఏదో కారణం ఉంది... ఆ పేళా అంతేగా? తన మొట్ట మొదటి కథ ప్రచురించబడ్డప్పుడు, అనెంతో సంతోషంతో ప్రభ పట్టుకు వెళ్ళి ఆయనకిచ్చింది. ఎంతో అనందిస్తారని, ఏదైనా బహుమతి ఇస్తారని అనుకుంది. కాని, మౌనంగా చదివేసి, "బాగుందిలే" అనేసి వెళ్ళిపోయేరు. రెండోసారి పడ్డప్పుడు ఇవ్వబోతే "సరేలే, మంచిదే!" అంటూ చదవకుండానే వెళ్ళి పోయేరు. అయితే, తన కథలు పడుతున్నాయనే సంతోషంలో అంతగా పట్టించుకోలేదు. హు, నేను కథలు రాయటం ఆయన కిష్టం లేదు కాబోలు' అనుకుని వికలమైన మనస్సుతో వంటగదికి దారి తీసింది.

శంకరం భోంచేస్తున్నాడు మౌనంగా. సుశీల గుమ్మం దగ్గిర కూర్చుంది. రోజులా శంకరం ఇవాళ సరదాగా లేడు. అతనికి తను చేసింది సరైనదా? కాదా? అనిపిస్తూంది. తను అనవసరంగా సుశీల ఉత్సాహాన్ని బలవంతంగా అణిచేస్తున్నాడేమో అనిపిస్తూంది. ఎటూ నిర్ణయించుకోలేక పోతున్నాడు. "అసలివేళ ఇలా ఉన్నారేమండీ? నాతో చెప్పరూ!" అని సుశీల బతిమాలుతున్నా మాట్లాడలేదు. భోజనం ముగించి, మౌనంగా గదిలోకి వెళ్ళి పడుకున్నాడు ఆలోచిస్తూ.


సుశీలకూడా వంటగదిలో పని ముగించుకుని, శంకరంమంచం దగ్గిరికి వెళ్ళి నిలబడ్డాది. శంకరం చూసికూడా ఏమీ మాట్లాడలేదు. "ఏమండీ! ఒక్క మాటలో చెప్పెయ్యండి, నేను కథలు వ్రాయడం


అరుణా
స్త్రీల ఆరోగ్య సౌభాగ్యానికి
1898 నుండి ప్రసిద్ధిగాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
100-జి.ఎన్.రోడ్. మదరాసు 17
1

1968-69 లో మీ అదృష్టము
ఏదైన ఒక పుష్పం పేరున్ను, మీ చిరు నామాయున్ను వ్రాసిన ఒక పోస్టుకార్డు మాత్రం పంపండి. మీక వచ్చే 12 నెలలలో వ్యాపారంలో లాభ నష్టములు, ఉద్యోగంలో ప్రమోషను, బదిలీ, సంతానం, వివాహం, సౌఖ్యం, మొదలైన వివరములు, దుష్ట గ్రహ వీక్షణలకు శాంతి విధానములతో



పాటు రు. 1-25 పై లకు పంపగలము. పోస్టేజి అదనం. ఒకసారి చూచిన మీకే తెలియగలదు.
PT. DEV DUTT SHASTRI
Raj Jyotshi (A.P.W.)
P.B. No. 86, JULLUNDUR CITY

మీ కిష్టంలేదా?'' అన్నాది. ఆమె గొంతులో దిగులు కొట్టవచ్చినట్టు కనిపిస్తూంది.

శంకరం సుశీలని సూటిగా చూస్తూ, "సుశీ! నేను రాయవద్దన్నాను. ఇంక రాయడం, మానడం నీ ఇష్టం. ఇంక ఈ విషయం గురించి మాట్లాడకు'' అని చెప్పేసి, అటు తిరిగి పడుకున్నాడు. 'తన అదృష్టం బాగుంటే మానేస్తుంది, లేదా మానదు. ఏమైనా ఇంకేమీ మాట్లాడదలుచుకోలేదు' అనుకున్నాడు.

సుశీలకూడా ఇంకేమీ అనలేక, తన మంచంమీదకి వచ్చి పడుకుంది. 'అసలు కథలు రాయగలగటమే అదృష్టం. అలాంటిది తన కథలు పడుతున్నాయి కూడాను. ఎందరో తన కథలు పొగుడుతూ ఎన్నో ఉత్తరాలు రాస్తున్నారు. అవి చదువుతూంటే ఎంత ఆనందంగా ఉంటుందని! కాని, తెలిసిపోతూందిగా ఆయన కిష్టం లేదని. అయితే ఇంత పేరూ వదులుకోవలసిందేనా?' ఎటూ నిర్ణయించుకోలేక, కలతబారిన మనస్సుతో నిద్ర పోయింది.

● ● ●

మరువాడు ఉదయాన్నే శంకరం కాఫీ, టిఫిను ముగించి, ముందుగానే ఆఫీసుకి వెళ్ళిపోయేడు. ఆ వేళ సుశీలమనస్సేం బాగులేదు. చాలా దిగులుగా ఉంది. . . 'తనకి రోజూ ఎన్ని ఉత్తరాలు వస్తుంటాయనీ! అవి చదువుతూంటే ఎంతో ఆనందంగా ఉంటుంది! ప్చ్! వీటి మూలకంగా ఆయన దూరమైపోతారో ఏమిటో! ఎంతమంది మెచ్చుకున్నా ఏం లాభం? ఆయన ముభావంగా ఉంటే! ఈ ఒక్క విషయంలో తప్ప, తనంటే ఎంత ప్రేమనీ! అసలు వచ్చిన సంబంధాలన్నీ వదులుకున్నది తనకోసం కాదూ! తనకోసం, తన సౌకర్యంకోసం ఎంత ఖర్చు పెడతారో! అంత అదృష్టం ఎంతమందికుంటుంది? బయటివాళ్ళు ఎంత పొగిడితే మాత్రం ఏం లాభం? ఇంట్లో ఇలా ఉంటే!' చాలాసేపు ఆలోచించి ఆలోచించి, ఒకసేపు ఏడుపు ముంచుకువస్తున్నా, 'అవును, ఇంక ఆయనని కష్టపెట్టకూడదు. తనేగా రాసింది కథల్లో భర్త ఎలా చెబితే అలా నడుచుకున్నప్పుడు సంసారమే స్వర్గసీమ అవుతుందని. తప్పదు. మానేస్తాను.' అని నిశ్చయించుకున్నాది. అప్పుడే వచ్చిన ప్రభలో కిందటి తన కథకి ప్రథమబహుమతి వచ్చినా, ఇదివరకులా సంతోషించలేకపోయింది. నిస్పృహయితేనో, కూడని ఒక విధమైన కసితో ఆ కథని ముక్కలు ముక్కలుగా చింపేసింది. అవును మరి, ఎవరికైనా మంచినందిచ్చి, రుచి చూపించి, లాగేసుకుంటే ఎలాగుంటుంది? ఈ ప్రపంచం అంతా శూన్యంగా, రాకాశిలా కనబడింది సుశీలకి!

ఆఫీసుకి వెళ్ళేడన్నమాటేగాని, శంకరంమనసు మనసులో లేదు. ఎంత వద్దన్నా అతనికి మాటిమాటికి దిగులుగా ఉన్న సుశీల మొహమే కనిపిస్తూంది.' పెళ్ళి అయినవాటినించి తను ఒక్కనాడూ సుశీలమొహం అలాగుండగా చూడలేదు. అసలు, తను అలాటి అవకాశం ఇవ్వలేదు. ఇప్పటివరకు తామెంత సంతోషంగా గడిపేశామనీ! మరి, ఇవాళ ఆమె అలా బాధపడటానికి కారణం ఎవరు? తనేగా? అవును తన స్వార్థంకోసం ఆమెని బాధ పెడుతున్నాడు. సుశీల అలా బాధ పడకూడదు. అవును. ఏమైనాసరే సుశీల ఎప్పుడూ నవ్వుతూనే ఉండాలి!' అని స్థిరంగా నిశ్చయించుకున్నాడు శంకరం. అతని మనస్సు తేలిక పడింది.

ఇంతలో అతని స్నేహితుడు ప్రకాశం గబగబా లోపలికి వచ్చి, అమాంతంగా తన చేతిని ఊపేస్తూ, "కంగ్రాచ్యులేషన్స్ శంకరం! మీ మిసెస్ కథకి ప్రథమబహుమతి వచ్చింది. ఐయాం వెరీగ్లాడ్! మరి, టీపార్టీ ఎలా ఇస్తావో?'' అన్నాడు. గతవారం రోజులుగా పొందని అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందేడు శంకరం. కనీసం "థాంక్స్'' చెప్పటంకూడా మరిచిపోయి ఫైళ్ళన్నీ డ్రాయరులో పడేసి,ఇంటికి బయలుదేరేడు.

సంతోషంగా ఇంట్లో అడుగు పెట్టిన శంకరం తక్కున ఆగిపోయేడు. ముక్కలు ముక్కలయిన ఆమె కథ నేలమీద వెలవెలబోతూంది. సుశీల మంచంమీద పడుకుని ఉంది. ఆమె కన్నీటితో దిండు తడిసి పోయింది. శంకరం గుండె బావురుమంది. అలాంటి పరిస్థితి కల్పించినందుకు తనని తనే శపించుకున్నాడు. నెమ్మదిగా వెళ్ళి వంగి, "సుశీ! ఏమిటిదంతా? లే, నీ కథకి బహుమతి వచ్చింది. చూడు, ఏం తెచ్చేనో!'' అన్నాడు తను తెచ్చిన మల్లెపూలదండని వెనక్కి దాచుకుంటూ. సుశీలకి మల్లెపూలంటే చాలా ఇష్టం.

గబగబా లేచి కూర్చుని, తల వంచుకుని నెమ్మదిగా, "ఇవాళనుండి కథలు రాయను లెండి!'' అన్నది. శంకరంగుండె చెరువయింది.

"సుశీ! జరిగిందంతా మరిచిపో! నువ్వు సుప్రసిద్ధ రచయిత్రివవ్వాలి. ఊఁ. లే క్విక్- వేగం భోజనం ముగించి, సినిమాకి పోదాం. ఇవాళ మధ్యాహ్నం సెలవుపెట్టేశాను'' అన్నాడు, లేని హుషారు తెచ్చుకుని.

సుశీల ఆశ్చర్యపోయింది. తన సౌఖ్యంకోసం బలవంతంగా తన ఇష్టాన్ని మార్చుకుంటున్నారు. ఇలాంటి శంకరంకోసం తను కథలు రాయడం మానెయ్య లేదూ? మరోసారి సుశీలనిర్ణయం గట్టిబడింది. "వద్దండీ! నే నింక రాయలేను. కథలు రాయనంత మాత్రాన కొంప మునిగిపోదులెండి.'' నవ్వుదామని ప్రయత్నించి, విఫల అయ్యింది.

"సుశీనువ్వు రాసితీరాలి!''అలా భయపెట్టినట్టున్నా మనస్సు మార్చుకుంటుందేమోనని ఆశపడ్డాడు శంకరం.

కాని, సుశీల అతని వేపొకసారి అదోలా చూసి, "నేను రాయలేను'' అని ఇంక అక్కడ ఉండలేక లోపలికి వెళ్ళిపోయింది. అతను నిస్పృహయంగా కిందికి చూసేడు. ఆమె చీరకొంగు తగిలి క్రిందపడిన పెన్నుపాళీ, ఆమె హృదయంలాగే విరిగిపోయింది! ★

## ✱✱ ధర్మసందేహాలు ✱✱

### అతి పొడుగైన వృక్షాలు ఏవి?

నేలమీద అతి పొడుగైన వృక్షాలు ప్రపంచంలో రెండు రకాలు ఉన్నాయి. కాలిఫోర్నియా లోని సిక్వోయావృక్షాలు, ఆస్ట్రేలియాలోని యూకలిప్టస్ వృక్షాలు ప్రపంచంలోకల్లా ఎత్తయిన చెట్లు. యూకలిప్టస్ చెట్టు ఒక్కొక్కటి 500 అడుగుల పొడవు పెరుగుతుంది. సిక్వోయాచెట్టుకి "వనపిత'' అనే బిరుదున్నది. దాని పొడవు 400 అడుగులని అంచనా వేశారు. అయితే, సముద్రగర్భంలోని వృక్షాలు నేలమీద పెరిగేవాటికంటే అతి దీర్ఘమైనవని చెప్పాలి. దక్షిణ అమెరికాలో దక్షిణభాగ సముద్రంలో సుమారు ఆరువందల అడుగుల నిడివి గల సాగరవృక్షాలు కనిపించాయి. ప్రపంచంలోకల్లా అత్యున్నతంగా పెరిగే వృక్షాలకంటె అవి దీర్ఘమైనవని నిర్ణయించారు.

### ఆకాశం ఎందుకు నీలంగా కనిపిస్తుంది?

వాయుకణాలు, దుమ్ము, వాతావరణంలోని నీటిఆవిరి అన్నీ సూర్యకాంతిని విడగొట్టి చెల్లాచెదరు చేస్తాయి. సూర్యకాంతికూడా అన్ని తెల్లకాంతులున్నట్లే ఏడు రంగుల మిశ్రమం. ఆ రంగుల్నే మనం ఇంద్రధనస్సులో విడిగా చూస్తుంటాము. ఈ వివిధ రంగుల కాంతి కిరణాలన్నిటినీ తీసి ఒకదానిగా కలిపితే తెల్లటి కాంతే వస్తుంది.

కాంతి గురించి తెలుసుకోవలసిన అంశాలు చాలా ఉన్నాయి. అయితే కాంతికి తరంగాల మాదిరి ప్రవహించే గుణం ఉంది. నీళ్లల్లో రాయి విసిరితే కెరటాలు ఎలా ఉత్పన్నమౌతాయో అదేవిధంగా కాంతికెరటాలు కూడా ప్రవర్తిస్తాయి. వివిధ రంగుల కాంతికిరణాలు వివిధరకాలుగా ప్రసరిస్తుంటాయి. నీలిరంగు కాంతికెరటాలు, ఎరుపు లేదా నారింజరంగు కాంతికిరణాలకంటె చాలా చిన్నవి.

భూమి వాతావరణం నించి సూర్యకాంతి ప్రసరించి గాలిలోని చిన్నకణాలకు తగలగానే ఆ కణాలు చెదరగొట్టగలిగినంత నిడివినే కాంతి తరంగాలు కలిగి ఉంటాయి. ఎరుపు, నారింజ రంగు కాంతితరంగాలు దీర్ఘమైనవి కావడంవల్ల వాతావరణంగుండా ప్రసరించగలుగుతాయి. నీలి కాంతి ఈ విధంగా చెల్లాచెదరు చేయబడినందు వల్లనే ఆకాశం నీలంగా కనిపిస్తుంది.

### ఆహారం లేకుండా బ్రతికే జంతువు ఏది?

ఆహారం అవసరంలేకుండా బ్రతికేజంతువు ఒకటి ఉంది. అది సాలీడుకు దూరపు చుట్టం. అతి చిన్నప్రాణి అది. దానిని 'నీటి ఎలుగు' అని అంటారు. దానిపేరు "టార్డిగ్రేడ''. అది ఎక్కువగా తేమనేలలోనే బ్రతుకుతుంది. నేలమీద తేమ ఎండిపోతే ఈ ప్రాణికూడా ఎండిపోతుంది. అందరూ అది చచ్చిపోయిందనే అనుకుంటారు. కాని, దానిని నీళ్లల్లోవేసేకొద్ది నిమిషాల్లోనే ఉబ్బి, ఎండినకారణంగా పడిన ముడతలన్నీ మాయమౌతాయి. కాళ్ళు బారచాపి మెల్లగా నడక సాగిస్తుంది. ఒక గంట వ్యవధిలో అది తన మామూలు చురుకుదనం సంపాదిస్తుంది. కొన్ని రకాల నత్తలుకూడా ఆహారం లేకుండా కాలం దొర్లిస్తాయి.